
సాక్షి
పల్నాడు
మంగళవారం । 28 । మే । 2024



మొరాయించిన రైల్వే గేటు

పిడుగురాళ్ల: రైల్వే గేటు(మొండి గేటు) సోమవారం మధ్యాహ్నం మొరాయించింది. గంటలపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. మరమ్మతులు చేసి ట్రాఫిక్ పునరుద్ధరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం సోమవారం 504.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేటి నుంచి హనుమాన్ జయంతి



నగరంపాలెం: పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదాపీఠ పరిపాలిత శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి హనుమత్ జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పాలకవర్గ కార్యదర్శి కె.సాంబశివరావు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా పరిధిలోని 26 ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలలో సోమవారం జూనియర్ ఇంటర్ పరీక్షకు 6,574 మంది విద్యార్థులకు గాను 6,146 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సీనియర్ ఇంటర్ పరీక్షకు 2,096 మందికి గాను 1,972 మంది హాజరయ్యారు. కాగా, పదో తరగతి పరీక్షకు గైర్హాజరు శాతం అధికంగా ఉంటుంది. జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాలలో 941 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 398 మంది హాజరయ్యారు.

ఉచితంగా విత్తన, ఎరువుల పరీక్షలు

నరసరావుపేట రూరల్: ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. విత్తనాలు, ఎరువుల డీలర్లు వారికి అనుమానం వచ్చిన నమూనాలను కనీస రుసుం చెల్లించి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. విత్తన నమూనా ఫీజు మొలక శాతం రూ.200, ఫిజికల్ ప్యూరిటీ రూ.50, తేమశాతం రూ.50, ఎరువుల నమూనాలకు ఒక న్యూట్రియంట్ పరీక్షకు రూ.1000, రెండు న్యూట్రియంట్ పరీక్షకు రూ.1500, మూడు న్యూట్రియంట్ పరీక్షకు రూ.2000 చలనా చెల్లించి పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్



నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ సోమవారం కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి ర్యాండమైజేషన్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం, డీపీఓ ఎంవీ భాస్కరరెడ్డి, ఎన్ఐసీ అధికారి జగన్‌మోహన్ పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 65 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. మంగళవారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 12,001 నుంచి 27వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

అడుగడుగునా
అన్నదాతకు అండగా..

- 'మిచాంగ్' బాధితులకు ఇన్‌ఫుట్ సబ్సిడీ మంజూరు
- పంట నష్టం రైతులకు అందకుండా చంద్రబాబు కుట్రలు
- ఎన్నికల పేరుతో అన్నదాతకు సాయం చేయకుండా మోకాలడ్డు
- పోలింగ్ అనంతరం నిధులు జమ చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో పంట నష్టపోయిన రైతులు 5,890
- రూ.5.89 కోట్ల సబ్సిడీ విడుదల



మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన అరటి తోట(ఫైల్)

నరసరావుపేట రూరల్: ఖరీఫ్ ముంచుకొస్తోంది. రైతులు సన్నద్ధమవుతున్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచింది. డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతుల కన్నీళ్లు తుడిచే దిశగా ఆ నాడు ప్రభుత్వం అడుగులు వేసింది. నెలల వ్యవధిలోనే పంట నష్టపరిహారం(ఇన్‌ఫుట్ సబ్సిడీ) అందించే ప్రయత్నం చేసింది. ప్రకృతి వైపరీత్యాలలో ఒక సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ ముగియకుండానే ఇన్‌ఫుట్ సబ్సిడీ అందించే నూతన విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా నష్టపరిహారాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సరిగ్గా అదే తరుణంలో చంద్రబాబు అండ్ కో సైంధవ పాత్ర పోషించారు. ఎన్నికల కోడ్ పేరుతో రైతులకు పరిహారం నిధులు విడుదల చేయకుండా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి అడ్డు పడ్డారు. 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో పరిహారాన్ని ప్రభుత్వం ఇప్పుడు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.

వేగంగా నష్టాల అంచనా

నాటి మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వరి, మిరప, మొక్కజొన్న, మినుములు, కంది, అరటి, పొగాకు వంటి పంటలకు నష్టం వాటిల్లింది. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, వ్యవసాయ సహాయకులు ఆగమేఘాల మీద క్షేత్రస్థాయికి వెళ్లారు. ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికార యంత్రాంగం పంట నష్టాల జాబితాను పక్కాగా రూపొందించారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియన పూర్తి చేసి ఆ జాబితాలను సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉంచింది. అభ్యంతరాలు స్వీకరించి అర్హుల తుది జాబితా రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. నష్టపోయిన రైతులకు నెలల వ్యవధిలోనే పెట్టుబడి రాయితీని మంజూరు చేసింది. నిబంధనల మేరకు ఒక్కో పంటకు ఇన్‌ఫుట్ సబ్సిడీ నిర్ధారించారు.

జిల్లాలో మంజూరైన ఇన్‌ఫుట్ సబ్సిడీ పంటల వారీగా

పంట	రైతులు	పంటనష్టం (హెక్టార్లలో)	ఇన్‌ఫుట్‌సబ్సిడి (లక్షల్లో)
వరి	1524	867.406	147.45902
మొక్కజొన్న	301	188.944	23.61800
మినుములు	308	211.61	21.16100
కందులు	572	322.36	32.23600
పొగాకు	597	566.55	56.65500
మిరప	2300	972	1,65.00000
అరటి	208	137	34,00,000
ఇతర ఉద్యాన పంటలు	80	66	8,00,000
మొత్తం	5890	3331.87	560.12902

రైతులపై చంద్రబాబు కుట్రలు..

తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులపై టీడీపీ అధినేత చంద్రబాబు కనీస కనికరం చూపకపోగా, మేలు చేయడానికి సిద్ధమైన ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకున్నారు. రైతులకు పెట్టుబడి రాయితీ అందకుండా కుట్రలు చేశారు. ఎన్నికలను అడ్డుపెట్టుకుని పెట్టుబడి డబ్బులు మంజూరు చేయకూడదంటూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. దీంతో నిధులు విడుదలకు ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇన్‌ఫుట్ సబ్సిడీ డబ్బులు జమచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పంటల వారిగా హెక్టార్‌కు మంజూరు చేసిన ఇన్‌ఫుట్ సబ్సిడీ

పంట	ఇన్‌ఫుట్ సబ్సిడీ (రూ.)
వరి,వేరుశనగ, పత్తి, చెరకు, మిరప	17,000
మొక్కజొన్న	12,500
అరటి	25,000
మినుము, పెసలు, శనగలు పొద్దుతిరుగుడు, పొగాకు	10,000
జొన్న	8,500

రూ.25 వేలు అందాయి



తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు రెండున్నర ఎకరాల్లోని అరటి పంట నేలకొరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు అధికారులు పంటను పరిశీలించి నష్టం అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందని చెప్పారు. నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం రూ.25 వేలు నా అకౌంట్‌లో జమ అయింది. పంట నష్టపోయిన వెంటనే ఇన్‌ఫుట్ సబ్సిడీ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

–వెన్నపూస రంగారెడ్డి, కొండకావూరు

పెట్టుబడి రాయితీని అడ్డుకోవడం దారుణం



తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు సీఎం వైఎస్ జగన్ సాయం చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు ఓర్వలేక పోతున్నారు. చివరకు రైతులు నష్టపోయిన పంటలకు పెట్టుబడి రాయితీ డబ్బులు కూడా ఎన్నికల పేరుతో ఇవ్వనీయకుండా అడ్డుకోవడం దారుణం. బాబుకు రైతులు తగిన బుద్ధి చెబుతారు.

–గాలం గురుస్వాములు, పమిడిమర్రు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ పోటీలను విజయవాడలోని గేట్స్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం ప్రారంభించినట్లు ఎన్టీఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ తెలిపారు. గేట్స్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ కిషన్‌బాబు, మెంటార్ కృష్ణప్రభ ఈ పోటీలను ప్రారంభించారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని, తొలి రోజు మొదటి నాలుగు రౌండ్లు ముగిసే నాటికి ఉమెన్ ఫిడే మాస్టర్ ఎస్.ఎల్.వి.అనూష (గుంటూరు), ఫిడే మాస్టర్ వెంకటకార్తీక్‌కృష్ణ (ఎన్టీఆర్ జిల్లా), ఎండీ ఇమ్రాన్ (ఎన్టీఆర్ జిల్లా), వై.సేతుమాధవ్ (శ్రీకాకుళం) ముందంజలో ఉన్నారని వెల్లడించారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా జి.రామసుబ్బారెడ్డి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానాన్ని రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభయాంజనేయ స్వామి విశేష అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం వెంకట శేషారామాచార్యులు 1,008 గులాబీలతో అంజనీపుత్రుడికి ప్రత్యేక పూజలు చేశారు.





ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ ఉన్నారు. -పెదకాకాని

ఓట్ల లెక్కింపునకు పక్కా ప్రణాళిక

జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి శ్రీకేశ్ బి.లత్కర్

నరసరావుపేట: ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ వివరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్, వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఓట్ల లెక్కింపుపై దిశానిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి శాంతిభద్రతల సమస్య లేకుండా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను ప్రతిరోజూ పరిశీలించాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టామని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, జేసీ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం

స్ట్రాంగ్‌రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్ వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ తెలిపారు. పార్లమెంట్, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4వ తేదీ నిర్వహించనున్న కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఈవీఎంలు కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు, కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లోకి వెళ్లేందుకు వేర్వేరుగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్లు కూర్చునే విధంగా కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహించే జేఎన్‌టీయూఎన్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూముల వద్ద మూడు అంచెల భద్రతా కల్పించినట్లు వివరించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు బందోబస్తు కొనసాగుతుందని చెప్పారు. ఏడు అసెంబ్లీ, పార్లమెంట నియోజకవర్గానికి విడివిడిగా ఓట్లు లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పల్నాడుకు వ్యాక్సినేషన్ సెంటర్ మంజూరు

- రూ.2 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు
- పాత ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగం

నరసరావుపేట: రెండేళ్ల క్రితం ఏర్పడిన పల్నాడు జిల్లాకు జిల్లా వ్యాక్సినేషన్ సెంటర్(డీవీసీ) మంజూరైంది. సుమారు రూ.2 కోట్లతో నిర్మించే ఈ సెంటర్‌కు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వైద్యఆరోగ్య శాఖకు స్థలం కరువైంది. దీంతో రొంపిచర్ల మండలంలోని వి.రెడ్డిపాలెంలో లేదా సత్తెనపల్లి నియోజకవర్గంలోని మండల కేంద్రం ముప్పాళ్లలో నిర్మించాలనే ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ప్రజలకు అవసరమైన వ్యాక్సిన్లు ఈ సెంటర్‌లో భద్రపర్చి జిల్లా నలుమూలల్లో ఉన్న పీహెచ్‌సీలకు సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం గుంటూరులో ఉన్న డీవీసీ సెంటర్ నుంచి అవసరమైన వ్యాక్సిన్లు పల్నాడుకు తీసుకొస్తున్నారు.

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలి..

జిల్లా కేంద్రంలో డీవీసీ సెంటర్ ఉంటే ఇక్కడి నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు వీలుగా ఉంటుందని ఉద్యోగులు చెబుతున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయాన్ని పల్నాడు రోడ్డులోని సుమారు రెండెకరాల స్థలం ఉన్న పాత ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఇక్కడ ఉన్న వైద్యశాలను 90 శాతం విభాగాలను లింగంగుంట్ల కాలనీలో నిర్మించిన 200 పడకల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఇక్కడ చిన్న పిల్లల విభాగం మాత్రమే పనిచేస్తోంది. భవనాల్లో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, జిల్లా ఇమ్యూనైజేషన్, మలేరియా, లెప్రసీ జిల్లా కార్యాలయాలు, పీపీ యూనిట్ ఉన్నాయి. దీంతో పాటు కిడ్నీ రోగులకు కావాల్సిన డయాలసిస్ యూనిట్ సేవలు అందజేస్తోంది. ఈ డయాలసిస్ యూనిట్‌ను నూతన హాస్పిటల్‌లో మార్చాలనే ప్రతిపాదన ఉంది. ఈ హాస్పిటల్‌లో ప్రవేశ మార్గానికి ఎడమవైపున ఎవరూ ఉపయోగించకుండా శిథిలావస్థలో ఉన్న ఆర్ఎంఓ క్వార్టర్, దాని పక్కనే క్యాంటీన్ ఉన్నాయి. ఆర్ఎంఓ క్వార్టర్ ఎదురు కారు పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఆ ప్రదేశంలో డీవీసీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది.



పాత ఏరియా హాస్పిటల్‌లో చెట్లకింద శిథిలావస్థలో ఉన్న ఆర్ఎంఓ క్వార్టర్

ఐదు సెంట్ల స్థలం ఉంటే..

డీవీసీ సెంటర్‌కు ఐదు సెంట్ల స్థలం అవసరం మాత్రమే ఉంది. ఆర్ఎంఓ క్వార్టర్, క్యాంటీన్‌లు తొలగిస్తే స్థలం సరిపోతుంది. జిల్లా కేంద్రంలోనే ఈ సెంటర్ ఏర్పాటు వలన వ్యాక్సిన్లు జిల్లాలోని నలుమూలలకు సులభంగా తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అదే పది కిలోమీటర్ల దూరంలోని ముప్పాళ్ల, లేదా 15 కిలోమీటర్ల దూరంలోని రెడ్డిపాలెం పీహెచ్‌సీలలో ఏర్పాటు చేస్తే ఉద్యోగులు వ్యయప్రయాసలకు గురయ్యే అవకాశం ఉంది. అందువలన డీవీసి సెంటర్‌ను నరసరావుపేటలోనే ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ రవిని వివరణ కోరగా తమ శాఖకు నరసరావుపేట పట్టణంలో ఎక్కడా స్థలం లేకపోవటంతో తాను ముప్పాళ్ల పీహెచ్‌సీని సూచించామన్నారు. అక్కడ ఎకరంన్నర స్థలం ఖాళీగా ఉందన్నారు. స్థలం ఉండి ఆ సెంటర్ నరసరావుపేటలో నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. పాత ఏరియా హాస్పిటల్‌లో కావాల్సిన స్థలం ఖాళీగా లేదు అన్నారు.

అంతర్‌జిల్లా దొంగలు అరెస్టు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ వీరాస్వామి

పెదకాకాని: కార్లు, బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఉసా మణికంఠ, అన్నపురెడ్డి బ్రహ్మకార్తికేయ చిలకలూరిపేటలోని సురక్ష స్టోర్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేసి జల్సాలకు అలవాటుపడ్డారు. పల్నాడు జిల్లాలో కార్లు, బైక్‌లు చోరీ చేసి వాటిని అమ్ముకుని జల్సాలు చేస్తూ గడిపారు. ఈ నేపథ్యంలో ఈఏడాది ఏప్రిల్ 24న పెదకాకాని మండలం గడ్డిపాడు దర్గా ఎదురు ఉన్న ఎస్ కారు బజార్ షెడ్ తాళాలు పగులగొట్టి రెండు కార్లు దొంగిలించారు. కారు బజారు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా రెండు కార్లతోపాటు పట్టాపురం పోలీసుస్టేషన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్, సుజికి యాక్టీవా స్కూటీ, పెదనందిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్, కంప్యూటర్లు, ప్రింటర్లు, పల్సర్ బైక్ చోరీ చేసినట్లు అంగీకరించారు. వాటి విలువ మొత్తం రూ.18,40,000 ఉంటుందని పోలీసులు గుర్తించారు. నిందితులు ఉసా మణికంఠ, అన్నపురెడ్డి బ్రహ్మ కార్తికేయలను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ కె. వీరాస్వామి తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి కేసులో టీడీపీ కార్యకర్తల అరెస్ట్

నరసరావుపేట టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి చేయటంతో పాటు అక్కడ ఉన్న వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో ఐదుగురు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు. ఎన్నికల పోలింగ్ రోజు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు మారణాయుధాలతో ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న మూడు కార్లు ధ్వంసం చేసి అడ్డు వచ్చిన కంజుల రామకోటిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి ఈ కేసులో ఇప్పటికే పది మందిని అరెస్ట్ చేయగా తాజాగా పట్టణానికి చెందిన అల్లాబక్షు, సమీర్, రవి, ఖాజా రాకేష్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో నిందితులను గుంటూరు జిల్లా సబ్ జైల్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

పెదకూరపాడు(అమరావతి): మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వీరయ్య(26) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన సమాచారం.. గ్రామానికి చెందిన తాళ్లూరి వీరయ్య కుటుంబ కలహాల నేపథ్యంలో అబ్బరాజుపాలెం గ్రామ పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో సోమవారం సాయంత్రం పురుగుమందు తాగాడు. మృతి చెంది అక్కడ పడిఉండడంతో గుర్తించిన గ్రామస్తులు మృతుని బంధువులకు సమాచారం అందించారు. పెదకూరపాడు పోలీసులు వీరయ్య మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. ఘటనపై మృతుడి తల్లి వెంకాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

బియ్యం తూకంపై ఫిర్యాదులు లేవు

నరసరావుపేట: స్థానిక పౌరసరఫరాల మండల స్టాకు పాయింట్ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం తూకానికి సంబంధించి డీలర్ల నుంచి ఫిర్యాదులు లేవు అని జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి సోమవారం పేర్కొన్నారు. స్టాకు పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జి లేదని, చిన్న కాటాపై బస్తాలు పెట్టి కాటావేసి డీలర్లకు ఇస్తున్నారంటూ ఈనెల 27న ఓ దినపత్రికలో వచ్చిన కథనంలో ఎటువంటి వాస్తవాలు లేవు అన్నారు. ఈనెల 25న ఆ పత్రిక విలేకరి తమ గోడౌన్‌కు వచ్చిన సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు డీలర్లతో వేలిముద్రలు తీసుకోవటం, ఆర్వోలు ట్రాక్ షీట్లు ప్రింట్ తీసే క్రమంలో ఉన్నారన్నారు. ఆ సమయంలో ఒక హమాలీ కాటా యంత్రం వద్ద కుర్చీలో కూర్చొని ఉండగా ఆ విలేకరి ఫొటో తీశాడని గోడౌన్ ఇన్‌చార్జి జి.జయప్రకాష్ తమకు తెలిపారన్నారు.

పనులలో వేగం పెంచండి

- డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్
- ఉపాధి హామీ పనులు పరిశీలన



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్

పెదకూరపాడు(అమరావతి): తొలకరి దగ్గర పడుతున్న తరుణంలో పనులలో వేగం పెంచాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పాటిబండ్ల, జలాల్‌పురం గ్రామాలలో జరుగుతున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మంది పనిలోకి వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ ఏడాది రూపొందించిన పనుల అంచనాలు నూటికి నూరుశాతం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పొలాల సాగు సమయంలో నీటిని నిల్వ ఉంచటానికి ఉపయోగపడే నీటికుంటలు అధికంగా తవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకటం చేసుకోవాలని దీనికి పూర్తిస్థాయిలో సబ్సిడీ ఇస్తామని తెలిపారు. పశుగ్రాసం పెంపకానికి 25 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకు సుమారు రూ.43వేలు సాయం అందిస్తామని గేదెల పెంపకందారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. జాబ్‌కార్డులు ఉన్న వారు 100రోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలన్నారు. పెదకూరపాడు మండలంలో 3.50లక్షల పనిదినాలు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రస్తుతం 1.70లక్షల పనిదినాలు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనిదినాలు పూర్తిచేసి రూ.17కోట్ల అంచనా వ్యయాన్ని పూర్తిచేయాలన్నారు. పరిశీలనలో ఏపీఓ కోటేశ్వరరావుతో పాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

30న జానపద, సాంస్కృతిక సంబరాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాపయ్యచౌదరి, రమణ, నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో ఈనెల 30న గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జానపద, సాంస్కృతిక సంబరాలను నిర్వహిస్తున్నట్లు నాట్స్ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి చెప్పారు. సోమవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా బాపయ్య చౌదరి మాట్లాడుతూ దశాబ్దాలుగా అమెరికాలో స్థిరపడిన తెలుగువారు స్థాపించిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో 'జానపద – సాంస్కృతిక' సంబరాలు పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 'భాషే రమ్యం, సేవే గమ్యం' అనే నినాదంతో చిరకాలంగా తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణతో పాటు నాట్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాట్స్ అధ్యక్షుడిగా నాలుగోసారి భారతదేశ పర్యటనలో ఉన్న తాను ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. తెలుగు ప్రజలకు విద్య, వైద్య సేవా కార్యక్రమాలతో పాటు మహిళా సాధికారిత కోసం స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి 100 మంది జానపద కళాకారులు హాజరు కానున్నట్లు వివరించారు. కోవిడ్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన కళాకారులను ఆదుకునేందుకు తమ వంతుగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల సంక్షేమం కోసం నాట్స్ అవిశ్రాంతంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. పెదనందిపాడుకు చెందిన ఎన్నారై నూతి బాపయ్యచౌదరి నాట్స్ అధ్యక్షునిగా తెలుగు ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. గురువారం నుంచి జరగనున్న సంబరాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక, కళారూపాల ప్రదర్శనతో పాటు 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, ఐదుగురు కవులు, కళాకారులకు గౌరవ పురస్కారాలు, వందమంది జానపద కళాకారులకు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు పీవీ రమణ, కార్యక్రమ నిర్వహణ సభ్యుడు కాకుమాను నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి చంద్రారెడ్డి



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీరాల అర్బన్: ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యతని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి శవనం చంద్రారెడ్డి అన్నారు. ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ.. మన బాధ్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరుల్ని దుర్వినియోగం చేయరాదని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పర్యావరణ కాలుష్యం పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. నేటి ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ కాలుష్యమే ప్రధాన కారణమని చెప్పారు. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర మనల్ని రక్షిస్తుందని వివరించారు. కాలుష్యం బారిన పడకుండా దాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. గాలి, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యతగా కృషి చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు జూన్ 5న జరిగే పర్యావరణ దినోత్సవ సభలో బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, శ్రీమన్నారాయణ, గ్రంథ పాలకురాలు డి.ధనమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెపోటుతో మృతి



పిడుగురాళ్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి(61) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. పట్టణంలోని తన స్వగృహంలో గుండెల్లో మంటగా ఉందని చెప్పడంతో వెంటనే గుంటూరు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఓ చర్చి పాస్టర్‌గా పనిచేస్తూ ప్రతి ఒక్కరితో స్నేహంతో మెలిగేవారు. వైఎస్సార్ సీపీలో చేరి వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఆయన అకాల మృతికి మున్సిపల్ చైర్మన్ కొత్తా వెంకటసుబ్బారావుతో పాటు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య మరియమ్మతో పాటు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పట్టణంలో క్షుణ్ణంగా తనిఖీలు

మాచర్ల: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న నేపథ్యంలో పోలీసులు విధించిన 144 సెక్షన్ కొనసాగుతోంది. అందులో భాగంగా జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలో రామాటాకీస్, రింగ్‌రోడ్డు, గుంటూరు రోడ్డు, నెహ్రూనగర్, బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పట్టణంలోకి అనుమతిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతుడు నాగరాజు

రాజుపాలెం: ఎదురుగా వస్తున్న లారీని టీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలో మాచర్ల– గుంటూరు రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గుంటూరు వస్తుండగా అదే సమయంలో ఎదురుగా గుంటూరు నుంచి పిడుగురాళ్ల వెళుతున్న లారీని చౌటపాపాయపాలెం ఢీకొట్టింది. లారీ డ్రైవర్ పానకాల నాగరాజు(48)కు తీవ్ర గాయాలు కావడంతో 108లో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి నాగరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఏలూరు టౌన్‌లోని పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలోని జయప్రకాష్‌నగర్‌కు చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షమీర్‌బాషా కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య !

నరసరావుపేట టౌన్: వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని కోట సెంటర్ షాపింగ్ మాల్ పక్కన తాటి పల్లవి(22), భర్త పూర్ణచంద్రరావు నివాసం ఉంటున్నారు. ఏడాది వయస్సు ఉన్న బాలుడు ఉన్నాడు. వీరికి వివాహం అయి మూడేళ్లు. మనస్పర్థల కారణంగా కొద్ది నెలల కిందట భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల జోక్యంతో ఇద్దరు కలసి ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె సోదరుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త హత్యచేసి ఆత్మహత్య చిత్రీకరిస్తున్నట్లు బంధువులు ఆరోపించారు. టూటౌన్ సీఐ భాస్కర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టి పరారైన కారు

- రెడ్డిపాలెం టోల్‌గేట్ వద్ద ఘటన
- మహిళ తలకు తీవ్ర గాయం



ప్రమాదానికి కారణమైన కారు



ప్రమాదానికి గురైన కారు

పిట్టలవారిపాలెం: కారును ఢీకొట్టి ఆగకుండా పరారైన కారు సంఘటన మండలంలో చోటు చేసుకుంది. చందోలు శివారులోని భవనంవారిపాలెం పంచాయతీ పరిధిలో గల రెడ్డిపాలెం సెంటర్‌లోని టోల్‌గేట్ వద్ద ఓ కారు ఫీజు చెల్లించేందుకు ఆగిఉంది. ఇదే సమయంలో మరో కారు అతి వేగంగా వచ్చి ముందు ఆగున్న కారును ఢీకొట్టింది. ఇందులోని వారు అంతే వేగంగా వెనక్కి తిప్పి పరారయ్యారు. ఈ ఘటనలో ముందు కారుకు బలమైన దెబ్బతగలడంతో పాటు వెనుక వైపు కూర్చున్న ఓ మహిళ తలకు తీవ్ర గాయమైంది. ఆమెను గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. ప్రమాదంపై చందోలు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. టోల్‌గేట్ వద్ద గల సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పరారైన కారు నంబర్‌ను ఆరా తీయగా, కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన డి.వి.శ్రీనివాసరావు పేరుతో ఉన్నట్లు తెల్సింది. పరారైన వారిని గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కరెంటు తీగలు తగిలి గడ్డివాములు దగ్ధం

రూ.7 లక్షల వరకు నష్టం

చీరాల అర్బన్: గడ్డివామిలకు కరెంటు తీగలు తగలడంతో నిప్పురవ్వలు పడి దగ్ధమైన ఘటన సోమవారం వేటపాలెం మండలం పాపాయిపాలెం పంచాయితీ వాకావారిపాలెంలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. పాపాయిపాలెం పంచాయతీలోని వాకావారిపాలెంలో పులి సుబ్బారావుకు చెందిన 20 ఎకరాల గడ్డివామికి కరెంటు తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో దట్టమైన పొగలతో మంటలు వ్యాపించాయి. ఉవ్వెత్తున ఎగసిపడి పక్కనే ఉన్న పావులూరి రఘురాజుకు చెందిన 15 ఎకరాల గడ్డివామికి వ్యాపించాయి. అప్రమత్తమైన వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పులి సుబ్బారావుకు రూ.4 లక్షలు, పావులూరి రఘురాజుకు రూ.3 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ మేరకు అగ్నిమాపక సిబ్బంది బాధితుల నుంచి వివరాలు నమోదు చేశారు.

ప్రతి తల్లీబిడ్డకు ట్యాగ్ తప్పనిసరి

- తల్లీబిడ్డల సంరక్షణ అందరి కర్తవ్యం
- గుత్తేదారుడు బాధ్యతగా పని చేయాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో తల్లీబిడ్డకు ప్రతిరోజూ ట్యాగ్ తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం నవ జాత శిశువుల దొంగతనాన్ని నిరోధించే(ఆర్ఎఫ్ఐడీ) కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం బాలింతల వార్డును తనిఖీ చేశారు. తనిఖీల్లో తల్లీబిడ్డలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించారు. కేవలం కంటి తుడుపుగా గుత్తేదారుడు పని చేస్తున్నట్లు కనపడుతోందన్నారు. ఒక్కో వార్డులో 25 నుంచి 30 మంది బాలింతలు ఉండగా అందులో కేవలం ఐదారుగురికి మాత్రమే ట్యాగ్‌ను అమరుస్తున్నట్లు చెప్పారు. కాన్పు అయిన ప్రతి బాలింతకు, బిడ్డకు ట్యాగ్‌ను అమర్చాల్సిన అవసరం ఉందన్నారు. బాలింతలకు, బిడ్డలకు ట్యాగ్‌లు లేకపోవడం వల్ల పిల్లలు అపహరణకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయాన్నీ పలుమార్లు గుత్తేదారుడికి చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ పని చేసే సిబ్బంది కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారని, మూడు షిఫ్టులలో ముగ్గురిని నియమించక పోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనివల్ల సాయంత్రం, రాత్రి సమయాల్లో పిల్లల సంరక్షణకు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారని చెప్పారు. తల్లీబిడ్డకు ట్యాగ్ తీసి పెట్టుకునే విధంగా కాకుండా లాక్ పడే విధంగా ట్యాగ్‌ను కట్టుదిట్టంగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గుత్తేదారునికి నోటీసులు పంపించినట్లు వెల్లడించారు.

మలేరియా పరీక్షలపై శిక్షణ



గుంటూరు మెడికల్: జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలోని లేబొరేటరీలో సోమవారం మలేరియా టెక్నీషియన్లకు రెండు రోజుల మలేరియా మైక్రోస్కోపిక్ శిక్షణ పునఃశ్చరణ తరగతులు (హాండ్స్ ఆన్ ట్రైనింగ్) ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్‌లో వర్షాలు పడటం, తద్వారా పరిసరాలలో నీరు నిలబడడం, దోమలు గుడ్లు పెట్టడం లాంటి పరిస్థితులతో దోమలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం మాట్లాడుతూ మలేరియా పారాసైట్ పరీక్షించడంతోపాటుగా, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, ఆరోగ్య విస్తరణాధికారి గణేష్, మలేరియా ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

జూన్ 26 నుంచి ట్యాలీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 26 నుంచి కంప్యూటర్ ట్యాలీ, ఫొటోగ్రఫి అండ్ వీడియోగ్రఫిలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజులు ఉంటుందని, వయోపరిమితి 19 నుంచి 44 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, 10వ తరగతి మార్కుల కాపీ పాస్ లేదా ఫెయిల్ కాపీలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్‌బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు, 0863–2336912, 8125397953, 9700687696, 9949930155ను సంప్రదించాలని ఆయన వెల్లడించారు.

విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో ప్రవేశాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం బృందావన్ గార్డెన్స్ 4వ లైన్ దివ్యాంగ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శారీరక, దృష్టి, వినికిడి లోపం కలిగి ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఐటీఐ, బీటెక్ మొదలగు కోర్సులు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక సారి ఇంటర్‌లో ప్రవేశం పొందిన వారు, వారి వసతికోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు వారి చదువు కొనసాగించకోవచ్చని చెప్పారు. విద్యార్థులకు దుస్తులు, భోజనం, వసతి, నోట్ పుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్, సౌందర్య పోషణ ఖర్చులు ఉచితంగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు(బాలురు) శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలురు మరిన్ని వివరాలకు కె.యోగయ్య హాస్టల్ వార్డెన్(9542958956)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో అశ్రద్ధ వద్దు

ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



చిన్నారులకు పౌష్టికారం అందిస్తున్న పద్మావతి

చెరుకుపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి తెలిపారు. మండలంలోని రాంబొట్లవారిపాలెం, కనగాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల్ని సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్ని సందర్శించి రికార్డుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో పల్లపట్ల సీడీపీవో ఎం.అనసూయ, జిల్లా బాలల సంరక్షణ అధికారి పురుషోత్తమరావు, డాక్టర్ అబ్దుల్ సమ్మద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ దుర్మరణం



సునీల్‌కుమార్ మృతదేహం

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ దుర్మరణం చెందిన ఘటన సోమవారం గుంటూరు నుంచి పెదకాకాని వెళ్లే రోడ్డులో జరిగింది. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వేము సునీల్‌కుమార్(35) ఎన్నికల భద్రతా విధుల కోసం మాచర్లకు వెళుతూ తన బైక్‌ను పెదకాకాని మండలంలోని రిలయన్స్ పెట్రోల్‌బంక్ వద్ద పార్క్ చేశాడు. మాచర్ల నుంచి రిలీవ్ అయి సోమవారం తెల్లవారుజామున వచ్చిన ఆయన రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని బైక్‌ను తీసుకుని ఇంటికి బయలు దేరాడు. చీకట్లో ఉదయ్ ఆస్పత్రి ఎదుట ఉన్న స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో సునీల్‌కుమార్ (35) తలకు బలమైన గాయమైంది. దీంతో అతను ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్య నాగహన్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో హోంగార్డుగా పని చేసిన సునీల్ 2020లోనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. భార్య నాగహన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. సునీల్ మృతితో గుంటూరు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న సహచర సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

కోపంలో తమ్ముడిపై కర్రతో దాడి

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోదరుడి మృతి

గుంటూరు ఈస్ట్: కోపంలో తమ్ముడిపై ఓ అన్న కర్రతో దాడిచేశాడు. గాయపడిన తమ్ముడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం.. సంగడిగుంటలో నివాసం ఉండే ఆరేపల్లి శివమ్మ రెండో కుమారుడు సాంబయ్య (28) భార్య నుంచి విడిపోయి మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని అన్న దుర్గారావును తరచూ అడుగుతుండేవాడు. ఆదివారం రాత్రి దుర్గారావు తన కుమార్తె రాజేశ్వరి పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా సాంబయ్య మద్యం కోసం డబ్బులు అడిగాడు. అందుకు దుర్గారావు నిరాకరించాడు. దీంతో సాంబయ్య అన్నను కర్రతో కొట్టాడు. కోపోద్రిక్తుడైన దుర్గారావు కర్రతో సాంబయ్య తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సాంబయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్త గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సాంబయ్య అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.